


పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి  అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

# వేలాది ప్రదర్శనలు ఇచ్చిన బబ్బన్‌ఖాన్

## ( విజయచిత్ర 1982, డిసెంబర్ నుంచీ పునర్ముద్రణ)




ఒక్క నాటకం ద్వారా కటిక దారిద్ర్యం నుంచి కోటికి పడగెత్తిన వ్యక్తి బబ్బన్‌ఖాన్. తన ఉర్దూ నాటక 'అద్రక్ – కే – పంజే'ని దేశ విదేశాల్లో మొత్తం 5,000 సార్లు ప్రదర్శించి ప్రపంచ రికార్డు సృష్టించి 'గిన్నిస్ బుక్'కి ఎక్కారు బబ్బన్‌ఖాన్.

చదువుకున్నది ఇంజనీరింగ్ అయినా నాటక కళకే అంకితమైన కుటుంబంలో పుట్టిన వై.జి.మహేంద్ర కూడా నాటకాలే వృత్తిగా చేసుకుని నాటకాలలో కొనసాగుతూనే ఇవాళ తమిళ చిత్ర రంగంలో మేటి హాస్య నటుడిగా వెలుగొందుతున్నారు. 'కాళి', 'అమావాస్య చంద్రుడు' మొదలైన చిత్రాల ద్వారా మహేంద్ర తెలుగు ప్రేక్షకులకీ పరిచితులే.

వీరిద్దరినీ సమావేశపరచి 'విజయచిత్ర' వారి మధ్య ఇష్టాగోష్టి నిర్వహించింది.

గోష్టి:

మహేంద్ర: మన రెండు కుటుంబాలలోనూ ఒక విచిత్రమైన పోలిక వున్నది గమనించారా మీరు, మీ భార్య, పిల్లలు నాటకరంగానికి అంకితమైనట్లే, మా కుటుంబంలోనూ మా తండ్రి వై.జి.పార్ధ సారధి నటుడు. తల్లి రాజ్యలక్ష్మి నాటక విమర్శకురాలు. నా భార్య గాయని. రజనీకాంత్, వైజయంతిమాల మాకు దగ్గర బంధువులు.

బబ్బన్‌ఖాన్: మన రెండు కుటుంబాలూ కళాకారుల కుటుంబాలు కావడం సంతోషించదగ్గ విషయం. అయితే నాటక కళ అన్నది మా కుటుంబంలో నాతోనే ప్రారంభమైంది. నా భార్యా పిల్లలు నా నాటకంలో నటించడమన్నది ఆకస్మికంగా జరిగింది.

మహేంద్ర: ఒకే నాటకాన్ని ఐదువేలసార్లకు పైగా ప్రదర్శించి లక్షలాదిమందిని వినోదపరుస్తున్న మీ నాటకం వెనుక స్ఫూర్తిని కలిగించిన సంఘటన ఏదో వుండి వుంటుందని నేననుకుంటున్నాను. అదేమిటో చెబుతారా?

బబ్బన్‌ఖాన్:అవును. వున్నది. అది విషాద సంఘటన. నా జీవితంలో జరిగినదే.

మహేంద్ర: అదేవిటిసార్. అంతమందిని నవ్విస్తున్న ఆ నాటకం వెనుక విషాద్మ వుందంటారు?

బబ్బన్‌ఖాన్: అవును. 1966 సెప్టెంబర్‌లో మొదటిసారిగా నేనీ నాటకాన్ని ప్రదర్శించాను. ఈ నాటకం రాయడానికి ప్రేరణ కలిగించినవి అంతకు ముందు మా కుటుంబంలో జరిగిన సంఘటనలే. ఏడుగురు పిల్లలున్న మా కుటుంబంలో నేనే చివరివాణ్ణి. మా నాన్నగారు హఠాత్తుగా మరణించారు. ఆయన మరణంతో నా చదువుకి స్వస్తి చెప్పాల్సి వచ్చింది. మా అమ్మ, నలుగురు అక్కయ్యలు ఇద్దరు అన్నలు. మేము కటిక దరిద్రం అనుభవించాం. తిండి లేక, జబ్బు చేస్తే మందులు లేక వీటన్నిటికీ మూలమైన డబ్బు లేక నా తోడపుట్టిన వాళ్ళు ఒక్కొక్కరే కాలగమనంలో కలిసిపోతూ వుంటే నిస్సహాయంగా చూస్తూ, ఆ విషాదాన్ని మరచిపోవడానికి చుట్టుపక్కల మిత్రులని నవ్విస్తూ నేను నవ్వడానికి ప్రయత్నిస్తూ వుండేవాడిని. అప్పుడే మా నాన్నగారు పాటించని 'కుటుంబ నియంత్రణ' గురించి ఆలోచన వచ్చింది. మా కుటుంబ కథనే నాటకంగా ఎందుకు రాయకూడదు అనుకున్నాను. మేమప్పుడు ఆఘాపురాలో వుండేవాళ్ళం. ఆ ప్రాంతంలో ఒకే ఒక వీధి దీపం వుండేది. దాని క్రింద కూర్చుని రాయడం ప్రారంభించాను. మూడు గంటల్లో ఈ నాటకం తయారైంది.

మహేంద్ర: మీ జీవితంలో ఇంతటి విషాదం దాగి వున్నదా? అయినా ఆ విషాదాన్ని కప్పి పెడుతూ అంత హాస్య రసభరితంగా ప్రదర్శిస్తున్న మిమ్మల్ని అభినందించక తప్పదు. మీ నాటకంలో మొత్తం ఎన్ని పాత్రలు?

బబ్బన్‌ఖాన్: మొత్తం పదిహేడు పాత్రలు. అయితే మేము కాక ఆరుగురు మాత్రమే. బయటి వారిలో కొందరు రెండు మూడు పాత్రలు కూడా పోషిస్తారు. అయితే వీరెవరూ పర్మనెంట్ ఆర్టిస్టులు కాదు. ఆర్నెల్లకొకసారి మారుస్తూ వుంటాను. అందుకు తగ్గట్టుగా నాటకాలలో వేషాలు వేయాలనే ఉత్సాహం వున్న కొత్తవారికి ఎప్పటికప్పుడు తర్ఫీదు ఇస్తూ తయారు చేస్తూ వుంటాను. సాధారణంగా మనం ఎదుర్కొనే క్రమశిక్షణారాహిత్యం వల్లనే ఇలా చేయడం. ఇందువల్ల వారు

ఒక కట్టుబాటుకులోనై ప్రవర్తించడమే కాక క్రమశిక్షణతో కూడా వుంటారు. అసలు ఈ కారణంగానే నా భార్య కూడా నాతోపాటు నటించాల్సి వచ్చింది. లేకపోతే అంతకుముందు ఆమెకు నాటకానుభవమే లేదు.

మహేంద్ర: మీది ప్రేమ వివాహమా?

బబ్బన్‌ఖాన్: కాదు. పెద్దలు కుదిర్చిన వివాహమే. 1977లో నాకు శైలతో వివాహమయింది. మాకు ఇద్దరమ్మాయిలు టీనా, నాజూ.

మహేంద్ర: నాటకమైతే రాశానన్నారు కానీ మీ మొదటి ప్రదర్శన ఏ విధంగా ఇచ్చారో చెప్పనే లేదు?

బబ్బన్‌ఖాన్: ఇవాళయితే ఇంత ఖ్యాతి, హైద్రాబాదులో పెద్ద బంగళా, పూనాలో స్థలం, బెంజ్ కారు వున్నాయిగానీ ఆ రోజుల్లో ఈ ఆర్థిక వనరులేవీ? ఆ నాటకాన్ని మిత్రులకి చూపించాను. ప్రదర్శించమనీ, తామూ పాల్గొంటామనీ ప్రోత్సహించారు. మా అమ్మగారినడిగాను. ఆమె తన మంగళసూత్రం నాకిచ్చింది. అది అమ్మితే 275 రూపాయలు వచ్చింది. అందులో రెండు వందలతో హైదరాబాదులోని రవీంద్రభారతి ఆడిటోరియం బుక్ చేశాను. తక్కిన డబ్బుతో టిక్కెట్లు అచ్చు వేయించాను. ఇంటింటికీ వెళ్ళి అమ్మాను. కొందరు ఎగతాళి చేశారు. కొందరు నా మీద జాలిపడి కొన్నారు. అయితే వారిలో చాలామంది ప్రదర్శనకు రానేలేదు. ఆ ప్రదర్శనలో నష్టమే వచ్చింది. అయినా ఒక మిత్రుడి ఆర్థిక ప్రోత్సాహంతో రెండవ ప్రదర్శన వారం తిరక్కుండానే ఇచ్చాను. అందులో 150 రూపాయలు పొదుపు చేయగలిగాను. సెప్టెంబర్ 66లోనే మూడవ ప్రదర్శన ఇచ్చాను. 500 ఆదాయం లభించింది. ఆ తర్వాత బొంబాయిలో వరుసగా మూడు ప్రదర్శనలు ఇచ్చాను. ఇప్పటిదాకా ఒక్క బొంబాయిలోనే 900 ప్రదర్శనలదాకా ఇచ్చాను. అఫ్‌కోర్స్.. హైద్రాబాదులో వెయ్యికి పైగా ఇచ్చాను. మొత్తం భాతతదేశంలోని ముప్పై మూడు నగరాలలో నాలుగు వేల ఏడువందలకి పైగా ప్రదర్శనలు ఇచ్చాను.

మహేంద్ర: తక్కిన ప్రదర్శనలు విదేశాల్లో ఇచ్చారన్నమాట.

బబ్బన్‌ఖాన్: అమెరికా, కెనడా, ఫ్రాన్స్, ఇటలీ, ఇంగ్లండ్, మలేసియా, సింగపూర్, జపాన్ దేశాలలో 375 ప్రదర్శనలు ఇచ్చాను. అమెరికాలో నటుడు రెక్స్ హారిసన్, దర్శకుడు ఫ్రాన్సిస్ కొప్పొలా మొదలైన వారు నా నాటకాన్ని చూసి మెచ్చుకున్నారు. ఆశ్చర్యపోయారు కూడా. ఎంచేతంటే అంతకుముందే ప్రపంచంలోకల్లా పెద్ద ప్రదర్శనశాల అయిన మాడిసన్ గార్డెన్‌లో రెక్స్‌హారిసన్ ప్రదర్శించిన 'మై ఫెయిర్ లేడీ'లో 75 మంది వాద్య గోష్ఠి, అంతమంది కళాకారులూ, భారీ సెట్టింగులూ వున్నాయి. నా నాటకంలో సంగీతం లేదు, పాటలు లేవు. ఒకే ఒక సెట్టు, దాని ఖరీదు 650 రూపాయలకి మించలేదు. అంతేకాదు. నా నాటకానికి నేనే మేకప్ మాన్‌ని.

మహేంద్ర: ఇది నిజంగా గొప్ప విశేషమే. నాటకం ఆకట్టుకోవడానికి భారీ హంగులు అవసరం లేదని నిరూపించారు.

బబ్బన్‌ఖాన్: అంతేకాదు. లండన్ రాయల్ ఆల్‌బర్ట్ హాల్‌లో ఒక్క ప్రదర్శనతో మన దేశానికి దాదాపు ఇరవై లక్షలు విదేశీ మారకద్రవ్యం అర్జించి పెట్టాను.

మహేంద్ర: హిందీ, ఉర్దూ భాషా నాటకాలు విదేశాలలో అధికంగా ప్రదర్శించడానికి అవకాశాలు లేవు.

బబ్బన్‌ఖాన్: అలాంటిదేమీ లేదు. అమెరికాలోగానీ యూరోప్‌లోగానీ నేను నాటకం వేసిన ప్రతి ఆడిటోరియంలోనూ కంప్యూటర్ విధానం ద్వారా వారి భాషలలోకి అనువదించే సౌకర్యాలు వున్నాయి. అందువల్ల మీరు అక్కడ నాటకాలు వేయవచ్చు. భాషాభేదం అన్నది రానేరాదు.

మహేంద్ర: అలాగా. అయితే తప్పకుండా ప్రయత్నించాల్సిందే. అయితే మరొక్క విషయ నాకు నచ్చలేదు. మీరేమీ అనుకోనంటే చెబుతాను.

బబ్బన్‌ఖాన్: చెప్పండి.

మహేద్ర: మీరిక్కడికి వచ్చారు. మీ అంతట మీరు ప్రదర్శనలు ఇస్తున్నారు. మీ ప్రతిభని గుర్తించి ఇక్కడి పత్రికలవారు మిమ్మల్ని కలుసుకుని మీ గురించి వివరాలు తెలుసుకుని ప్రచురిస్తున్నారు. అంతెందుకు మీరు ఉర్దూ నాటక కళాకారులు. నేను తమిళ నాటక నటుడిని. నాలుగైదు తెలుగు సినిమాలలో నటించినా తెలుగులో ఇంకా అంత పాపులర్ కాలేదు. అయినా 'విజయచిత్ర' వారు భాషాభేదం లేకుండా మనిద్దర్నీ సమావేశపరచి గోష్ఠి నిర్వహిస్తున్నారు. నేనూ బొంబాయి, ఢిల్లీ, కలకత్తా, హైద్రాబాదు మొదలైన ప్రాంతాలలో నా నాటకాలు వేశాను. కాని అక్కడి పత్రికలు మా గురించి రాయకపోయినా కనీసం మా నాటకాల రివ్యూలు కూడా ప్రచురించలేదు. ఇది నన్ను చాలా బాధించింది.

బబ్బన్‌ఖాన్: ఇది చాలా గర్హించదగ్గ విషయం. ఈసారి ఆ నగరాలలో నా ప్రదర్శన అప్పుడు అక్కడి పత్రికలవారితో ఈ విషయం ప్రస్తావిస్తాను.

మహేంద్ర: థాంక్స్. అన్నట్టు మీరు నటులుగా ఇంతటి ప్రజాదరణ పొందారు కదా. సినిమాలలో అవకాశాలు వచ్చే వుంటాయే. మరెందుకు నటించలేదు?

బబ్బన్‌ఖాన్: అవకాశాలు అనేకం వచ్చాయి. ఒక విషయం చాలామందికి తెలియదు. నేను ఒక చిత్రంలో నటించాను కూడా. 'ఏక్ ముట్టి ఆస్మాన్' హిందీ చిత్రంలో మూడు దృశ్యాలలో కనిపిస్తాను. అయితే సినిమాలలో కొనసాగడం ఇష్టంలేక ఆ తరువాత వచ్చిన అవకాశాలు అంగీకరించలేదు. కారణం ఏకాగ్రత కొరవడుతుందని కూడా. అంతెందుకు నా నాటకం 'అద్రక్ కే పంజే'ని చిత్రంగా తీస్తామంటూ చాలామంది ముందుకు వచ్చారు. అయితే నేనందుకు అంగీకరించలేదు. నా నాటకాన్ని తెర మీదనో, టీ.వీకో వీడియోకో మార్చడం నాకిష్టం లేదు. అలా చేస్తే అందులోని స్వారస్యం పోతుంది. నా నాటకాన్ని చూడాలనుకున్న వారు రంగస్థలం పైన చూడవలసిందే.

మహేంద్ర: అదన్నమాట మీ నాటక విజయంలోని రహస్యం. మీరు చెప్పిన మాట కొంతవరకు నిజమే అయినా మీతో పూర్తిగా నేను అంగీకరించలేను. నా విషయమే తీసుకుందాం. దాదాపు ప్రతి శని, ఆదివారాలు, పండుగనాడు సాయంత్రం పూట నేను నాటకాలు వేస్తూనే వున్నాను. సినిమాలలోనూ నటిస్తున్నాను. ఒక ప్రణాళిక ప్రకారం నడుచుకుంటే ఈ రెండూ కూడా కొనసాగించవచ్చును. మా నాటకాలు కొన్ని చలనచిత్రాలుగా రూపొందించబడ్డాయి. విజయవంతమూ అయ్యాయి. అయితే మీలాగా మేము ఒక్క నాటకమే ప్రదర్శించము. ఒకసారి సినిమాగా వచ్చిన తర్వాత ఆ నాటకాన్ని అట్టే ప్రదర్శించము. ఎప్పటికప్పుడు కొత్త నాటకాలని తయారు చేస్తూ వుంటాము. కాబట్టి మాకు ఏ ఇబ్బందీ ఏర్పడదు. అవును.. మీరెందుకు రెండో నాటకాన్ని తయారు చేయలేదు?

బబ్బన్‌ఖాన్: 'గుంబత్ కా కబూతర్' పేరిట లంచగొండితనం పైన ఒక నాటకం రాసాను. కాని 'అద్రక్ కే పంజే' విశేషమైన ఆదరణ పొందడంతో ఆ నాటకాన్ని ప్రదర్శించడానికి అవకాశం లభించలేదు. వచ్చే సంవత్సరం తప్పకుండా ఈ నాటకాన్ని ప్రదర్శిస్తాను. అలాగే 'అద్రక్ కే పంజే' రెండవ భాగం కూడా ప్రదర్శించబోతున్నాము.

మహేంద్ర: మా నాటకాల గురించి మీ అభిప్రాయం ఏమిటి?

బబ్బన్‌ఖాన్: మీ నాటకాలలో నాకు నచ్చిన అంశం, వెంట వెంటనే సీన్లు మారడం. నేనూ ఈ విధానాన్నే అమలు పరుస్తున్నాను. సీనుకి సీనుకి మధ్య ఎక్కువ విరామం వుంటే ప్రేక్షకులకి విసుగ్గా వుంటుంది.

మహేంద్ర: నిజమే. ప్రేక్షకులు నాటకాలు చూడ్డానికి వచ్చేది కాస్సేపు నిత్యజీవితం మరచి సరదాగా గడపడానికి కదా.

బబ్బన్‌ఖాన్: నాటకాలు వినోదాన్ని కలిగించాలన్న సత్యాన్ని నేను నమ్ముతాను. నా నాటకాలు ప్రేక్షకులని ఆకర్షించడానికి ప్రధాన కారణం అందులోని హాస్య రసమే. కాని నాటకాల్లోని కథాంశం సామాజిక దృష్టితో కూడుకుని కూడా వుండాలన్నది నా అభిప్రాయం. అంటే నిత్యజీవితంలోని వరకట్న దురాచారం, కుటుంబ నియంత్రణ, లంచగొండితనం వగైరా సమస్యలను చర్చించాలని.

మహేంద్ర: మీ నాటకంలో ఇమిడీనట్లుగా కుటుంబ నియంత్రణ అనే సామాజిక సమస్య చుట్టూ హాస్యం ఇమిడితే ఫర్వాలేదు. కానీ ఒక కామెడీ నాటకంలో సామాజిక స్పృహ, ఒక సాంఘిక సమస్య ఇతివృత్తంగా వున్న కథాంశంలో హాస్యంగానీ బలవంతంగా రుద్దితే ఆ హాస్యం అపహాస్యం పాలయి జనం మధ్యలోనే థియేటర్ విడిచివెళ్ళడమే కాదు. తిరగబడతారేమో కూడా.

బబ్బన్‌ఖాన్: మీరు చమత్కారంగా మాట్లాడతారు..

మహేంద్ర: అందుకే కదా హాస్యనటుణ్ణయ్యాను. సీరియస్‌గా మాట్లాడగలిగితే ఒకేసారి కథానాయకుణ్ణే అయిపోయి వుండేవాడిని కదా.

బబ్బన్‌ఖాన్: ఇవాళ సాయంత్రం 'కలై వాణర్ అరంగం'లో నా నాటకం వుంది. మీరు తప్పకుండా రావాలి.

మహేంద్ర: అరె... ఇక్కడా క్లాష్ తప్పడం లేదన్నమాట.

బబ్బన్‌ఖాన్: అదేమిటి?

మహేంద్ర: ఇవాళ సాయంత్రమే 'రాణి సీతై హాల్'లో నా నాటకం 'రూబాయిక్కు మూ్ఱు కొలై ' (రూపాయికి మూడు హత్యలు) ప్రదర్శన వుంటే మిమ్మల్ని ఆహ్వానిద్దామనుకున్నాను. కాని నా నాటకానికి మీరు రాలేరు. ఒకవేళ నాటకం మానుకుని మీ నాటకానికి నేనొచ్చానంటే రూపాయికి మూడు కాదు కదా ఉచితంగానే మూడు ముక్కలు చేస్తారు ప్రేక్షకులు నన్ను. సో బెటర్ లక్ నెక్స్ట్ టైమ్.

Post your comments